క్లుప్తంగా

బధిరుల పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అందజేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న శిద్దా నాగేశ్వరరావు

చీమకుర్తి: స్థానిక ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలకు గ్రానైట్ యజమాని శిద్దా నాగేశ్వరరావు రూ.50 వేల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులు సురక్షితమైన తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో వాటర్ ప్లాంట్ అందించినందుకు నాగేశ్వరరావుకు కరస్పాండెంట్ అంజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బీ జవహర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు



బీసీ హాస్టల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీరాజ్యం

మద్దిపాడు: స్థానిక బీసీ హాస్టల్లో విద్యార్థులకు చైతన్య భారతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి డాక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి తమ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. విద్యార్థులు సులభతరంగా ఇంగ్లిషు మాట్లాడే విధంగా శిక్షణ ఇచ్చిన డాక్టర్ లక్ష్మీరాజ్యంను అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లిషు మాట్లాడటం వలన వారిలో ఆత్మవిశ్వాసం ఏర్పడుతుందన్నారు. పరీక్షలలోనే కాకుండా జీవితంలో కూడా ఈ క్లాసులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రామానంద్, తదితరులు పాల్గొన్నారు.

'బీఎంఆర్' ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

ఒంగోలు: స్థానిక కర్నూలు రోడ్డులోని బీఎంఆర్ ఆభరణ్ జ్యూయలరీ షోరూం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం వెయ్యికిపైగా మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, రంగారాయుడు చెరువు, ఏబీయం కాలేజీ గ్రౌండులో వాకింగ్‌కు వచ్చిన ప్రజానీకానికి బీఎంఆర్ అధినేత బొమ్మిశెట్టి రవికుమార్, వారి కుమారులు మల్లికార్జునరావు, ఈశ్వర్‌కుమార్ చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొమ్మిశెట్టి రవికుమార్ మాట్లాడుతూ తమ వంతుగా పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ తమ సంస్థను ఆదరిస్తున్న ప్రజానీకానికి మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్ల



స్వామివారికి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

కురిచేడు: మండలంలోని దేకనకొండ, పెద్దవరం, బయ్యవరం గ్రామాల కూడలిలో సింగరయ్య కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్ల బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కొండ వద్ద స్వామి వారికి పొంగళ్లు తయారు చేసి నివేదించారు. నూతనంగా విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భక్తులు హోమాలు చేశారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్ట వేదమంత్రోచ్చరణల మధ్య జరిగింది. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

వేగవంతంగా సర్వే పూర్తి చేయాలి

- జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంపై నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ప్రసాద్

ఒంగోలు సబర్బన్: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న సర్వేను వేగంగా పూర్తిచేయాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సిబ్బంది ఆదేశించారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నెహ్రూనగర్ సచివాలయం పరిధిలో మొత్తం 618 అసైన్‌మెంట్లు ఇచ్చామని, వాటిలో 537 అసైన్‌మెంట్లను పూర్తి చేశారని, మిగతావి కూడా పూర్తి చేయాలని ప్లానింగ్ సెక్రటరీని ఆదేశించారు. సిబ్బంది ప్రతిరోజూ 25 సేవలకు తగ్గకుండా ప్రజలకు అందించాలని సూచించారు. కరెంటు బిల్లు కట్టడం, లామినేషన్ సర్వీసెస్, ప్రాపర్టీ, వాటర్ ట్యాక్స్, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను సకాలంలో అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఏకరూపు దుస్తులు తప్పనిసరిగా ధరించాలన్నారు. పీఎం–జేఏవై సర్వే పురోగతి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే వీక్షణ సమావేశంలో పీఎం జేఏవై సర్వే పరోగతి గురించి ఆరా తీస్తున్నారన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, కొళాయి పన్ను గురించి ప్రత్యేకంగా సచివాలయ సిబ్బంది, నగర పాలక సంస్థ రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. నెహ్రూనగర్ సచివాలయం పరిధిలో మొత్తం డిమాండ్ సుమారు రూ.20,27,227 ఉండగా, రూ.11,83,327 వసూలు చేశారన్నారు. ఇంకా రూ.8,43,99 బకాయిలు ఉన్నాయన్నారు. సర్వేలకు సంబంధించి ఆర్‌డీఎంఏ ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్‌లో పురోగతి గురించి ఆరా తీస్తున్నారని వెల్లడించారు. సర్వే సక్రమంగా పూర్తి కాకపోతే శాఖాపరమైన చర్యలకు కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సచివాలయం పరిధిలోని అభివృద్ధి పనులపై కూడా సమీక్షించారు. మంజూరై ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సర్వే విషయంలో వలంటీర్లందరూ సచివాలయ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఎస్‌డీజీ సర్వే, పీఎం–జేఏవై సర్వే పురోగతి గురించి ఆరా తీశారు. సచివాలయం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ఆస్తి పన్ను, కుళాయి పన్నులు కట్టాలని నేరుగా ప్రజలకు కమిషనర్ కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కే వెంకటేశ్వర్లు, ఎంఈ కే మాల్యాద్రి, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, ఇంజినీరింగ్ అధికారులు గణపతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మిరియం శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మిరియాల శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్థల వివాదం పరిష్కారం



సంఘటన స్థలం వద్ద చర్చిస్తున్న తహసీల్దార్ రమణారావు, ఎస్సై మధుసూదన్‌రావు

కొత్తపట్నం: స్థానిక నాంచారమ్మ తల్లి దేవస్థానం స్థల వివాదం బుధవారం పరిష్కారమైంది. వారం రోజుల నుంచి రెండు వర్గాల మధ్య భూ వివాదం తారాస్థాయికి చేరింది. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చేసుకున్నాయి. నాంచారమ్మ తల్లి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 1429బీలో 72 గదుల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కొలతలు కొలిచి హద్దురాళ్లు వేసుకోవడానికి అనుమతులిచ్చారు. గ్రామస్తులు హద్దురాళ్లు వేసుకునే తరుణంలో కొందరు స్థానికులు తహసీల్దార్ బీవీ రమణారావు, ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావును కలిసి ఆలయ స్థలానికి ఫెన్సింగ్ వేస్తే.. తమ ఇంటికి వెళ్లడానికి బాట ఉండదని, తాము ఎలా వెళ్లాలంటూ ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్, ఎస్సై.. వారి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిపై సమీక్షించారు. ఇరువర్గాలను పిలిపించి ప్రతి ఇంటికి వెళ్లడానికి దారి ఉండాలని, తప్పనిసరిగా ఇళ్లకు దారి ఇవ్వాలని చెప్పారు. నాంచారమ్మతల్లి స్థలంలో ఎలా ఇస్తామని, సాధ్యపడదని గ్రామస్తులు ససేమిరా అన్నారు. తహసీల్దార్, ఎస్సైలతో గ్రామస్తులకు కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామస్తులను నచ్చజెప్పి నాంచారమ్మ తల్లి స్థలంలోనే ఇళ్లకు వెళ్లేందుకు బాట ఇచ్చే విధంగా చర్యలు చేపట్టడంతో వివాదం సద్దుమణిగింది. మిగతా స్థలంలో నాంచారమ్మతల్లి స్థలానికి హద్దు రాళ్లు వేసి కంచె ఏర్పాటు చేసుకున్నారు.

ఉగాదిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

- ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



జగనన్న కాలనీలో గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్: ఉగాది పండుగలోగా ఒంగోలు మండలంలోని అన్ని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గుండాయపాలెంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. తీర ప్రాంత గ్రామమైన గుండాయపాలెంలో నివాస వసతి లేని వారిని పారదర్శకంగా గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేసి గృహ నిర్మాణాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేశామన్నారు. కానీ, లబ్ధిదారులు మాత్రం గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడంపై ఎన్ని సమావేశాలు నిర్వహించినా ఆలస్యం చేస్తూనే ఉన్నారన్నారు. ఆర్థిక స్థోమత లేక గృహాలు నిర్మించుకోలేని వారికి రుణాలు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారి కోసమే కాంట్రాక్టర్ శేషగిరి ముందుకొచ్చారని, ప్రభుత్వ డిజైన్ ప్రకారమే గృహాలు నిర్మించి లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. లబ్ధిదారుల సందేహాలను ఎంపీడీవో నివృత్తి చేశారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణాలు ప్రారంభించని వారి పట్టాలు వెనక్కు తీసుకునేందుకు ఏమాత్రం వెనకడుగు వేసేది లేదన్నారు. హౌసింగ్ ఏఈ పృథ్వీ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ద్వారా వేగంగా గృహాలు నిర్మించి లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని గుండాయపాలెంలో ప్రారంభించడం మంచి విషయమన్నారు. జగనన్న కాలనీల్లో ఇప్పటికే అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆశీర్వాదం, సర్పంచ్ రేవు సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు పేతురు, బాబు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

కొత్తపట్నం: విద్యార్థులు చేతులను పరిశుభ్రం చేసుకుని ఆహారం తీసుకుంటే చేతుల్లో ఉన్న క్రిములు నాశనమై ఆరోగ్యంగా ఉంటారని సాడ్స్ స్వచ్ఛంద సంస్థ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ టి.లక్ష్మి తెలిపారు. స్థానిక ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు సాడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ, డెట్టాల్ బనేగ స్వాత్ ఇండియా గ్రామాలయ ఆధ్వర్యంలో హేండ్ వాష్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే పిల్లలు చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారం తినడంతో చేతుల్లో ఉన్న బ్యాక్టీరియా నోటిలోకి వెళ్లి వివిధ రకాల వ్యాధులు వస్తాయన్నారు. పిల్లలు చాలా జాగ్రత్తలు పాటించాలని, ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. విద్యార్థులకు ఆటల రూపంలో ఒకరి చేతిలో నుంచి మరొకరి చేతిలోకి ఏ విధంగా సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా వ్యాపిస్తాయనేది చేసి చూపించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం హరినాథ్‌రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో 80 శాతం పింఛన్ల పంపిణీ

కొత్తపట్నం: మండలంలోని 15 పంచాయతీల్లో బుధవారం మొదటిరోజు లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని 80 శాతం పూర్తి చేశారు. మార్చి నెలకు సంబంధించి 8,123 మంది లబ్ధిదారులకుగాను 6,498 మందికి రూ.1.98 కోట్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి నేడు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

రైతులందరితో ఈకేవైసీ చేయించాలి



ఈకేవైసీ రిపోర్టులు పరిశీలిస్తున్న ఏవో రమేష్

మద్దిపాడు: రైతులందరితో ఈకేవైసీ చేయించాలని మండల వ్యవసాయాధికారి కె.రమేష్ సూచించారు. మండలంలోని బసవన్నపాలెం, నందిపాడు, ఇనమనమెళ్లూరు గ్రామాల్లో ఆర్‌బీకేలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి రైతుతో ఈకేవైసీ చేయించాలని, దానివలన రైతు తన ఉత్పత్తిని అమ్ముకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అంతేగాకుండా ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగితే.. అటువంటి వారికి నష్టపరిహారం ఇచ్చేందుకు వీలవుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా వీఏఏల వద్దకు వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. వీఏఏలు గ్రామంలో రైతులకు అనువైన సమయంలో అందుబాటులో ఉంటూ ఈకేవైసీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మూడు ఆర్‌బీకేలలో రికార్డులు పరిశీలించిన తర్వాత కియోస్కులు పనిచేస్తున్నాయా..లేదా..? అని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో శేషయ్య, వీఏఏలు కోటేశ్వరరావు, ఉదయ కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు మనోధైర్యాన్ని పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న శివ

ఒంగోలు: విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలని, తద్వారానే సమాజంలో ఉన్నతంగా రాణించగలరని హైదరాబాద్‌కు చెందిన ఆర్‌సీ ఆల్‌టెక్ పవర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యనిర్వహణాధికారి వీటీ శివ పిలుపునిచ్చారు. స్థానిక పేస్ కాలేజీలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై బుధవారం అవగాహన కల్పించారు. పాజిటివ్ దృక్పథంతో ముందుకు వెళుతూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు జీవితంలో మంచి స్థానానికి చేరుకునేందుకు అవకాశాలు మెరుగవుతాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ట్రిపుల్‌ఈ విభాగం అధిపతి బి.నాగరాజు, కో ఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవల పరిశీలన



మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలిస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశీలకుడు రాజు

చీమకుర్తి: ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశీలకుడు టీ రాజు ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలం వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేములపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో వైద్య సేవలను బుధవారం పరిశీలించారు. స్థానిక డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది తల్లీబిడ్డలకు అందిస్తున్న వైద్యసేవలు, మాతా శిశు సంరక్షణ కార్డులలో నమోదు చేస్తున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా బాలింతలను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా తల్లీబిడ్డకు అందిస్తున్న సేవలను పొందే సమయంలో డాక్టర్ వద్దకు టీకాలకు వెళ్తూ ఎంసీఆర్ కార్డులు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో అందిస్తున్న సేవలపై పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక డాక్టర్ సుమన్‌కుమార్, హెచ్ఈవో నాగేశ్వరరావు, సీహెచ్‌వో సాయికృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆనంద్‌మాదిగ

ఒంగోలు: మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ భవనం నుంచి చర్చిసెంటర్ మీదుగా తిరిగి అంబేద్కర్ భవనం రోడ్డు వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగ అమరవీరుల సాక్షిగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామన్నారు. బీజేపీ ప్రభుత్వం మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విధంగా వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో రాజకీయ మూల్యం చెల్లించుకోకతప్పదని బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మహాజన్ సోషలిస్టు పార్టీ నాయకులు తిరువీధి బాబూమాదిగ, జొన్న బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట పూజలు

కనిగిరి రూరల్: పట్టణంలోని కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త కుందురు తిరుపతిరెడ్డి దంపతులు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. హోమాలు, పూజలు, ధాన్యాదివాసం, నిరాజన మంత్రపుష్పాలు అత్యంత నియమ నిష్టలతో జరిగాయి. కార్యక్రమంలో అఖిల భారత వాసవీసత్ర సయుదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ గుంట తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వైఎం ప్రసాద్‌రెడ్డి, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ నాయకులు బి.రమేష్, కొలిపర్తి వెంకట స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత రవి

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేపీ



రవికుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం తెలుగు యువత మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అనుచరుడు ఇండ్ల రవికుమార్‌రెడ్డి బుధవారం తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీ చేరారు. ఈ సందర్భంగా రవికుమార్‌రెడ్డికి, ఆయన అనుచరులకు కండువా కప్పి ఎమ్మెల్యే కేపీ వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విధానాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరినట్లు రవికుమార్‌రెడ్డి చెప్పారు. తాను స్థాపించిన ఇండ్ల ఫౌండేషన్ ద్వారా పలు సేవ కార్యక్రమాలు చేపట్టానని, భవిష్యత్తులో సేవలు కొనసాగిస్తూనే పార్టీ ఆశయాలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డిల ద్వారా ముందుకు తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీని రవికుమార్ సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణమోహన్‌రెడ్డితో పాటు పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, కౌన్సిలర్స్ కె.నగేష్, కొత్త కృష్ణ, పార్టీ నాయకులు ఉత్తమ్‌కుమార్, బట్ట గిరి తిరుపతిరెడ్డి, జవ్వాజీ రంగారెడ్డి, కురాటి చెన్నకేశవులు, దొంత నాగరాజుగౌడ్, వెంకటరమణ పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

కంభం: మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ మనుషులు, గేదెలు, ఆవులపై దాడులు చేస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవతున్నారు. రోడ్లపై తిరుగుతున్న వారిని వెంబడిస్తూ దాడులు చేస్తున్నాయి. కొన్ని వీధుల్లో పెంపుడు కుక్కలు సైతం పాదచారులు, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇక రాత్రి 9 గంటల తర్వాత నడుచుకుంటూ వెళ్లాలన్నా, ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్నా కుక్కల ధాటికి ప్రజలు భయపడుతున్నారు. రోజుకు ఒకరిద్దరు కుక్క కాటుకు గురై వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. బుధవారం పట్టణంలోని లాడ్‌ఖాన్ వీధిలో ఒక దూడపై కుక్కలు దాడి చేసి చంపేశాయి.

గతంలో కూడా పలుమార్లు గేదెలపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయని రైతులు చెబుతున్నారు. రాత్రి పూట ఇతర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లలో వచ్చిన వారికి ఆటోలు దొరక్కపోతే వారు ఇంటికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కందులాపురం కూడలి, రావిపాడు రోడ్డు, మెయిన్ బజారు, ఏబీఎం చర్చి, వై.జంక్షన్ సమీపంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలబారి నుంచి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



గుంపులు గుంపులుగా వెళ్తున్న కుక్కలు